క్లుప్తంగా

నేడు రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో శివరాత్రి పండుగ సందర్భంగా సోమవారం రాష్ట్ర స్థాయి పాల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నందీశ్వర స్వామి రైతు సంఘం సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన వృషభాల యజమానులు ప్రవేశ రుసుము రూ.500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.40,016, రూ.25,016, రూ.15,016, రూ.10,016, రూ.5,016, రూ.3,016 చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9866513812, 9550561950, 6304850031, 9704057249లను సంప్రదించాలని తెలిపారు.

సోమనాథ క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని హఠకేశ్వరం వద్ద గల సోమనాథక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు నగర సంకీర్తన, 7 గంటలకు అఖండనామసంకీర్తన , 9.30 గంటలకు గురుపాదుకపూజ, మహామృత్యుంజయ యాగం జరిపారు. మహాశివరాత్రి పర్వదినాన ఉపవాసం, జాగరణ,లింగోద్భావ సమయంలో శతరుద్రాభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో సోమనాథక్షేత్రం కమిటీ సెక్రటరీ నరసింగరావు, ట్రెజరర్ సుబ్బారావు, కమిటీ సభ్యులు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయ జయంతి



శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సత్రం నిర్వాహకులు

శ్రీశైలం: విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం. శ్రీశైలంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ నిత్యాన్నదాన సత్రంలోని రాయలవారి విగ్రహానికి కాపు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు సాంబయ్య, కోశాధికారి నాగేంద్ర మాట్లాడుతూ శ్రీశైలమహాక్షేత్రంలో శ్రీకృష్ణదేవ రాయలు చేసిన అభివృద్ధి పనుల గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సత్రం నిర్వాహకులు సుధాకర్, కోటేశ్వరరావు, కాపు నాయకులు రౌతు అశోక్, దాసరి విక్రమ్, శివ, వెంకటేశ్వర్లు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి

ఆత్మకూరు: పట్టణంలో విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శ్రీ అంబాభవాని దేవాలయంలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీహెచ్‌పీ నాయకులు శ్రీధర్‌గుప్త , కాంతారెడ్డి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ , భజరంగ్‌దళ్ సభ్యులు శ్రీనివాసులు, ఆవులయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి షటిల్ పోటీలు



విజేతలతో ఎస్‌ఐ కృష్ణమూర్తి, నిర్వాహకులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని కేవీకే ఇన్‌డోర్ స్టేడియంలో ఈ నెల 18న ప్రారంభమైన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. స్థానిక ఎస్‌ఐ కృష్ణమూర్తి చేతుల మీదుగా వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఏజీపీ సుధాకరరెడ్డి, వెంకటస్వామి గౌడ్, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నందికోల మహోత్సవం



నందికోల సేవ నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: శ్రీశైల ప్రథమ ముఖద్వారమైన నందీశ్వరాలయం వద్ద శివరాత్రి పండుగ సందర్భంగా ఆదివారం నందికోల మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. మండలంలోని ఇస్కాల గ్రామంలో భవనాశి నది ఒడ్డున వెలసిన నందీశ్వర క్షేత్రం వద్ద నుంచి నందీశ్వరస్వామిని మేళతాళాల మధ్య ఊరేగించారు. అంతకుమునుపు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో నందికోళ్లను భుజాననెత్తుకొని లయబద్ధంగా నృత్యం చేస్తూ నందికోల సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కమనీయం.. ఆది దంపతుల కల్యాణం



సంగమేశ్వరంలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న ఆలయ పురోహితులు

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీలలితా సంగమేశ్వరుల కల్యాణ మహోత్సవ కార్యక్రమం ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మోహన్ పర్యవేక్షణలో ఎంతో వైభవంగా జరిగింది. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా, విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించడంతో కల్యాణ తంతు కనుల పండుగగా సాగింది. ఇదిలా ఉండగా ఏటా తెలంగాణ రాష్ట్రం నుంచి వేల సంఖ్యలో భక్తులు కృష్ణానది మరబోట్లలో దాటి వచ్చి కల్యాణ కార్యక్రమంలో పాల్గొనే వారు. కాగా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల బోటు నిర్వహకుల మధ్య ఘర్షణ కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో బోట్ల రవాణ పూర్తిగా నిషేధించారు. దీంతో మహాశివరాత్రి పర్వదినం రోజున జరిగే సంగమేశ్వరుడి కల్యాణ మహోత్సవానికి తెలంగాణ భక్తులు హాజరు కాలేకపోయారు.

హుండీ లెక్కింపు....

సప్తనదుల సంఘమ క్షేత్రంలో వెలసిన సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా క్షేత్రంలో ఏర్పాటుచేసిన హుండీలో భక్తులు వేసిన కానుకలను ఆదివారం ఈఓ మోహన్, ఎర్రమఠం సర్పంచు బాల ఎల్లయ్య, గ్రామస్తులు జనార్ధన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.79,582 ఆదాయం వచ్చిందని, దీనిని దేవాలయ అవసరాల నిమిత్తం ఖర్చు చేస్తామని ఆలయ ఈఓ తెలిపారు.

కనుల పండువగా రుద్రకోటేశ్వరుని కల్యాణం

ఆత్మకూరు: నల్లమల అటవీపరిధిలోని రుద్రకోడు పుణ్యక్షేత్రంలో వెలసిన రుద్రాణి సమేత రుద్రకోటేశ్వరస్వామికి మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం స్వామిఅమ్మవార్లకు కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. పెళ్లికుమారుడుగా రుద్రకోటేశ్వరుడు, పెళ్లికుమార్తెగా శ్రీరుద్రాణి దేవిని అలంకరించి వేద పండితులు కంకణధారణ, భాసిక ,దారణ చేశారు. అనంతరం స్వామివార్లకు కల్యాణాన్ని నిర్వహించారు. ఎర్రగూడూరు నుంచి వచ్చిన ప్రభలతో సాంప్రదాయరీతిలో మేళతాళాల మధ్య స్వామిఅమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. వెంకటాపురం గ్రామంలో శివపార్వతులకు కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీనాయకులు కుందూరు నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించారు.

కమనీయం ఓంకారేశ్వరుడి కల్యాణం

బండిఆత్మకూరు: శివపార్వతుల కల్యాణోత్సవం శైవ క్షేత్రాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఓంకార క్షేత్రంలో ఆదివారం తెల్లవారుజామున వేలాది మంది భక్తులు వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చి స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. లింగోద్భవ సమయంలో స్వామి వారి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిగాయి. తర్వాత శివపార్వతుల కల్యాణంను పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



రుద్రకోడులో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నందివాహనంపై ఊరేగింపు..

నూతన వధూవరులైన ఆదిదంపతులు సాయంత్రం నందివాహనంపై ఊరేగారు. ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్, ధర్మకర్తల రామాపురం నారాయణ, కె.నారాయణల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివపార్వతుల కల్యాణం

మిడుతూరు: మండలపరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలోని శివాలయంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని శివ పార్వతుల కల్యాణోత్సవం శనివారం అర్ధరాత్రి శాస్త్రోక్తంగా, వేదమంత్రోచ్చరణల మధ్య కమనీయంగా సాగింది. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర విశేషపూజాధి కార్యక్రమాలను పురోహితులు రవితేజ ఆధ్వర్యంలో జరిపించారు. శివపార్వతుల కల్యాణం అనంతరం ట్రాక్టర్‌లో స్వామివార్లను ఆశీనులను చేసి గ్రామ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా శివాలయల్లో జాగరణ సందర్భంగా శివనామస్మరణతో భజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



చెరుకుచెర్లలో కల్యాణ తంతు జరిపిస్తున్న దృశ్యం

జోగులాంబ సమేత శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణం

చెరుకుచెర్ల గ్రామంలోని శివాలయంలో శ్రీ జోగులాంబ సమేత శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ పూజారి తంబలి కస్తూరయ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపించారు.

మహానందిలో వైభవంగా పుష్పపల్లకోత్సవం



మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి ఉత్సవమూర్తులను పుష్ప పల్లకీపై ఆశీనులు గావించి పూజలు చేస్తున్న దృశ్యం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానందిలో ఆదివారం తెల్లవారుజామున మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవిల కల్యాణోత్సవం కనులపండువగా జరుగగా, రాత్రి స్వామి, అమ్మవార్ల పుష్పపల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పుష్పపల్లకీల్లో కొలువుంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మామహేశ్వరరెడ్డి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా

కనుల పండువగా కాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం



తంగడంచలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



తూడిచెర్లలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

జూపాడుబంగ్లా: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తంగడంచ గ్రామంలో వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణమాత అమ్మవారి రథోత్సవాన్ని ఆదివారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అర్చకులు పన్నీటిస్నానం చేయించి పట్టువస్త్రాలతో అలంకరించారు. దేదీప్యమానంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆశీనులు గావించారు. భక్తుల శివనామ స్మరణలతో రథాన్ని గ్రామపురవీధుల్లో తిప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదులఈశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీశంకరమల్లేశ్వరస్వామి కల్యాణం

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం అర్ధరాత్రి లింగోద్భవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తూడిచెర్ల, తరిగోపుల, భాస్కరాపురం, తంగడంచ, 80బన్నూరు, మండ్లెం, తర్తూరు, పారుమంచాల తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో వెలసిన శివలింగాలకు బిల్వార్చన, పుష్పార్చన, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలతో విశేషపూజలు నిర్వహించారు. ఉపవాసదీక్షలతో భక్తులు శివలింగాలకు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహిస్తూ జాగరణ చేశారు. అనంతరం తూడిచెర్ల గ్రామంలో శ్రీమల్లికార్జున సమేత భ్రమరాంభిక అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. వేడుకలను కనులారా వీక్షించి భక్తులు భక్తిపారవశంతో తరించిపోయారు. ఈసందర్భంగా తూడిచెర్ల గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ఉమామహేశ్వరీదేవి అమ్మవారికి ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన మహిళలు సామూహికంగా భోనాలు సమర్పించారు. సాయంత్రం శ్రీభ్రమరాంబసమేత శంకరమల్లేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం అర్చకులు పూర్ణాహుతితో శివరాత్రి వేడుకలను ముగించారు.

వైభవంగా సర్వేశ్వర, భీమలింగేశ్వర స్వామి రథోత్సవం

పగిడ్యాల: స్థానిక బంగ్లా కట్ట శివాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు వైభవంగా సాగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ ఏడాది మొదటిసారిగా యాదవ, కురువ సంఘం సభ్యులు రథోత్సవ వేడుకలను నిర్వహించడం విశేషం. అలాగే బీరవోలు గ్రామం కేసీ కాలువ బ్రిడ్జి వద్ద వెలసిన భీమలింగేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు కనుల పండువగా సాగాయి.

రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది



మహానందిలో ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- రాష్ట్రస్థాయి ఎడ్లబల ప్రదర్శన పోటీలు ప్రారంభం

మహానంది: రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతుల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్లబల ప్రదర్శన పోటీలు ప్రారంభించారు. ఎమెల్యే మాట్లాడుతూ ఎడ్ల యజమానులను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి రైతు సంబరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలుగుగంగ కాల్వతో పాటు కేసీ కాల్వకు సమృద్ధిగా నీరు అందించి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. అధికారంలో ఉన్నా రైతుల శ్రేయస్సు కోసం పోరాడేందుకు ఎప్పటికీ శిల్పా కుటుంబం సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా వృషభాలు జయకేతనం

డీవీఆర్ మెమోరియల్ దేవభక్తుని సుబ్బారావు, కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరుకు చెందిన వృషభాలు మొదటి స్థానంలో నిలవగా రూ1.25లక్షల నగదును ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆర్‌కే బుల్స్ గుంటూరు జిల్లా వేటపాలెం ఎద్దులు ద్వితీయస్థానం సాధించగా రూ. 80వేల నగదును కొండా మధుసూదన్‌రెడ్డి, పులగం కృష్ణారెడ్డి, జస్వితారెడ్డిల వృషభాలు మూడోస్థానంలో నిలవగా రూ. 60వేల నగదును శీలం హరీష్‌రెడ్డి అందజేశారు. ఐలూరి మురళీకృష్ణారెడ్డి, , సురేంద్రారెడ్డి, సూర్యాపేట తెలంగాణ వృషభాలు నాలుగోస్థానంలో నిలవగా రూ. 40వేల నగదును శవ్వా మనోహర్‌రెడ్డి, శవ్వా శరభారెడ్డి బ్రదర్స్, వైడీఆర్ బుల్స్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఐదోస్థానంలో నిలువగా రూ. 30వేలు నగదు బహుమతిని సబ్బసాని అశోక్‌రెడ్డి అందించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. న్యూ క్యాటగిరీ విభాగంలో నంద్యాల మండలం పెద్దకొట్టాలకు చెందిన కేశవరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన వెంకటేష్ యాదవ్ వషభాలు రెండో స్థానంలో, చిన్నకానాలకు చెందిన చెన్నారెడ్డి ఎద్దులు మూడో స్థానం, వైఎస్సార్ జిల్లా కలపాకు చెందిన వెంకటరెడ్డి ఎద్దులు నాల్గవ స్థానంలో నిలిచాయి. వనికినిదెన్నెకు చెందిన శరబయ్య వృషభాలు ఐదో స్థానంలో, వైఎస్సార్ జిల్లా కొట్టాలకు చెందిన అంకిరెడ్డి ఎద్దులు ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు నగదును నిర్వాహకులు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు.

క్రిష్ణనంది క్షేత్రంలో..

క్రిష్ణనంది క్షేత్రంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆరు పండ్ల విభాగంలో జరిగిన ఈ పోటీల్లో పాణ్యం మండలం ఎస్.కొత్తూరుకు చెందిన వృషభాలు, ఇదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యేశ్వరరెడ్డి ఎద్దులు, పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన పల్లవి వృషభాలు తొలిమూడు స్థానాలు కైవసం చేసుకున్నాయి. వైఎస్సార్ జిల్లా కలసపాడు వీరతేజరెడ్డికి చెందిన వృషభాలు, అదే జిల్లా పాతసంగటి పల్లెకు చెందిన సుబ్బారెడ్డి ఎద్దులు, నంద్యాల మండలం ఉయ్యాలవాడకు చెందిన మహమ్మద్ ఖాసిం వృషభాలు , బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన నాగేష్, సంజామల మండలం లింగం దిన్నె గ్రామానికి చెందిన మేకల దీప్తికి చెందిన వృషభాలు ఆతరువారి స్థానాల్లో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.45వేలు, రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతులను వెంగళరెడ్డిపేట సర్పంచ్ పల్లె నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సోమశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అందజేశారు.

ప్రతి ఒక్కరిని ప్రేమించడంలోనే సంతోషం



చర్చి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న బిషప్ ఎగ్గోని పుష్పలత

పాములపాడు: ప్రతి ఒక్కరినీ ప్రేమించడంలోనే సంతోషం ఉంటుందని సీఎస్‌ఐ నంద్యాల డయాసిస్ బిషప్ ఎగ్గోని పుష్పలత అన్నారు. ఆదివారం మండలంలోని బానుముక్కల గ్రామంలో సీఎస్ఐ చర్చి విస్తరణ పనులకు ప్రార్థనలు చేసి శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ దేవుడు అందరిని ప్రేమిస్తాడని, మనుష్యులు కూడా ఒకరి పట్ల ఒకరు ప్రేమను కలిగి ఉండాలన్నారు. భవిష్యత్ తరాలకు నీతిని, ప్రేమను అందజేయాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. కార్యక్రమంలో నంద్యాల డయాలసిస్ కార్యదర్శి స్టాన్లీ విలియమ్స్, డీనరీ చైర్మన్ రెవరెండ్ జాను, పాస్టరేట్ చైర్మన్ రెవరెండ్ వేల్పుల ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరు గద్దం సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

దాతలకు దక్కని గౌరవం

మహానంది: ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం, దాతల ఆధ్వర్యంలో ఆలయాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామంటూ ఆలయ అధికారులు ప్రకటనలు గుప్పిస్తుంటారు. అయితే ఉత్సవాల సమయంలో వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఉత్సవాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ధర్మకర్తలు వీరభద్రుడు, బుసకాని వెంకటేశ్వర్లు తదితరులు సాధారణ భక్తుల్లా వెనుక నిల్చోవడం విమర్శలకు దారి తీసింది. అంతేకాకుండా ఓ కమ్యూనిటీకి చెందిన వారికే ఆలయంలో ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంభావనలు ఇచ్చేవారికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆలయాభివృద్ధికి పాటుపడేవారికి తక్కువ ప్రాధాన్యత అన్నట్లు ప్రవర్తిస్తున్నారనే చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా కీలకమైన లింగోద్భవ కాల రుద్రాభిషేకానికి ఆలయ అధికారి, సిబ్బంది తనకిష్టమైన వారికి పాసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

దాతలకు అవమానం

మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వచ్చే దాతలకు అడుగడుగునా అవమానం ఎదురవడంతో పూజల్లో పాల్గొనకుండా వెనుదిరిగి వెళ్లారు. నంద్యాలకు చెందిన కూరగాయల వ్యాపారి టి.రామన్న సన్స్ అధినేత ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు ప్రతి ఏటా కల్యాణోత్సవ దాతలుగా వ్యవహరిస్తున్నారు. అయితే వీరికి సరైన ప్రాధాన్యత కరువయ్యింది. నంద్యాల నుంచి వచ్చిన ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరిపై దాతలపై దురుసుగా ప్రవర్తించడం, ఎవరైతే నాకేంటి అంటూ ఆయన వ్యవహరించిన శైలిని దాతలు అవమానంగా భావించారు. దీనిపై దాతలు డీఎస్పీ మహేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత సీఐని ఆలయంలో విధుల నుంచి తప్పిస్తూ ట్రాఫిక్‌కు మార్చుతూ ఆదేశాలు ఇచ్చారు. మరో కీలక వ్యవస్థకు చెందిన వారికి సరైన ప్రాధాన్యత లేకపోవడం, ప్రొటోకాల్ పాటించకపోవడంతో రాత్రి పది గంటలకు పూజలకు రావాల్సిన వారు అర్ధరాత్రి వేళలో రావడంతో కల్యాణోత్సవం ఆలస్యం అయ్యిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



లింగోద్భవ పూజల్లో వెనుక సాధారణ భక్తుల్లా నిల్చున్న చైర్మన్, డీఎస్పీ మహేశ్వరరెడ్డి

జిల్లా స్థాయి కబడ్డీ విజేత శకునాల



కబడ్డీ విజేతలకు నగదు బహుమతిని అందజేస్తున్న యాదవ సంఘం సభ్యులు

పగిడ్యాల: మహాశివరాత్రిని పురస్కరించుకుని కురువ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సర్వేశ్వరస్వామి బంగ్లా కట్ట వద్ద నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో శకునాల జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు ఆదివారం నగదు బహుమతులను అందజేశారు. మిట్టకందాల, దామగట్ల, పడమర ప్రాతకోట జట్లు ఆతరువాతి వరుస స్థానాలలో నిలిచాయి. దాతలు లక్ష్మీనారాయణ, కురువ మల్లయ్య, బడికెల స్వాములు, అంబటి రామకృష్ణ, సర్పంచ్ శేషన్న, గొల్ల ఉసేనయ్య, తొండ గంగాధర్ సహకారంతో రూ. 12 వేలు, రూ. 8 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు నగదును అందజేశారు. అలాగే పొట్టేళ్ల పందెంలో గెలుపొందిన మండ్లెం ఖాదర్‌బాషా, తిమ్మాపురం హనుమ, చెరుకుచెర్ల వంశీ, నాగటూరు సాయి పొట్టేళ్లకు నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, యాదవ సంఘం సభ్యులు శెట్టిమాన్ మధు, తొండ మద్దిలేటి, గొల్ల శేషన్న, కరువ జమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల విజేత కలుగొట్ల



ఎద్దులు బండను లాగుతున్న దృశ్యం

ఓర్వకల్లు: ఉప్పలపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో కలుగొట్ల వృషభాలు విజేతగా నిలిచాయి. మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈపోటీలు నిర్వహించారు. ఇందులో వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన గొంది బజారు, దొర్నిపాడు బత్తుల మనోహర్‌యాదవ్ వృషభాలు (ఉభయజత) నిర్ణీత సమయానికి 4,170 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.40 వేలు గెలుపొందాయి. వెల్దుర్తి మండలం చెరుకులపాడు రామాంజనేయులు, బోయినపల్లె చరణ్ వృషభాలు (విడిజత) 3,300 అడుగుల దూరం లాగి రెండో బహుమతిగా రూ.20 వేలు సాధించాయి. బోయినపల్లె వెంకటరామయ్య, నందికొట్కూరు అబ్దుల్‌కలామ్ వృషభాలు సమాన దూరం లాగడంతో (3300 అడుగులు) రూ.20 వేల చొప్పున నిర్వాహకులు అందజేశారు. అలాగే ఇస్కాల రమణారెడ్డి, వర్కూరు రామచంద్ర వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ.8 వేలు, మంచాలకట్ట వెంకటస్వామి, బొల్లవరం దేవేంద్రనాయక్ వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.5 వేలు గెలుచుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆళ్లగడ్డ: రూరల్ మండలం బత్తలూరు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నపురెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బత్తలూరు గ్రామానికి చెందిన చెన్నపురెడ్డి సొంత పనిమీద ఆళ్లగడ్డకు వచ్చి మోటార్ సైకిల్‌పై గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని బైపాస్ రోడ్డు నుంచి కిందకు దిగుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

భక్తులకు వైద్యసేవలు



ఓఆర్ఎస్ ద్రావణాన్ని భక్తులకు అందజేస్తున్న రెడ్‌క్రాస్‌సొసైటీ సభ్యులు

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్రలో లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు రెడ్‌క్రాస్ సొసైటీ, డీఎంఅండ్‌హెచ్ఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు భక్తులకు మెరుగైన సేవలందిస్తున్నాయి. శివరాత్రి ఉత్సవాలు ఆరంభమైనప్పటి నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ వారు కైలాసద్వారంలోని ముఖద్వారం వద్ద, పెచ్చెర్వు వద్ద వీవీఆర్ సొసైటీ ఆధ్వర్యంలో వట్టి వెంకటరెడ్డి ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు నిరంతరం సేవలను అందించాయి. డీఎంఅండ్‌హెచ్ఓ ఆధ్వర్యంలో భీమునికొలను, హఠకేశ్వరం, పాతాళగంగ, లింగాలగట్టు, ఆలయం ముందు భాగంలో ఇలా 11 ప్రదేశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక పీహెచ్‌సీ, దేవస్థానం వైద్యశాలలు 24 గంటలు వైద్యులు, సిబ్బంది షిఫ్టల పద్ధతిలో పనిచేస్తూ ఎప్పటికప్పుడు భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అలాగే రెడ్‌క్రాస్‌సొసైటీ వారు పాదయాత్రతో డీహైడ్రేషన్ గురైన వారికి ఉచితంగా ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందజేస్తున్నారు.